క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కేటీదొడ్డి: మండలంలోని గంగన్‌పల్లి నుంచి వెళ్తున్న 33 కేవీ, ఇర్కిచేడు, నందిన్నె, సిద్ద న్‌పల్లి, సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీఈ రమేష్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఎర్సందొడ్డి, సుల్తాన్‌పురం, కుచినెర్ల, కేటీదొడ్డి, గ్రామాల్లో వర్షాకాలం ముందు చేయాల్సిన విద్యుత్ లైన్లు మరమ్మతు, కొత్తలైన్ వేయడం, చెట్ల కొమ్మలు తొలగించనున్నట్లు తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని వారు కోరారు.

పాఠశాలకు చేరిన పాఠ్యపుస్తకాలు



ఉండవెల్లి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాల గదిలో 21 పాఠశాలలకు సంబంధించిన 12,807 పాఠ్యపుస్తకాలు వచ్చినట్లు మండల విద్యాధికారి శివప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఎల్‌ఓసీ అందజేత



మానవపాడు: మండలంలోని కలుకుంట్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కరుణాకర్‌రెడ్డి బ్రెయిన్ సర్జరీతో హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బుధవారం ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం రూ.3లక్షల ఎల్‌ఓసీని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రుక్మాందర్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

వ్యక్తి అదృశ్యం



ఖాజాహుస్సేన్ (ఫైల్)

మానవపాడు: మండలంలో వ్యక్తి అదృశ్యమైన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. ఎస్ఐ చంద్రకాంత్ వివరాల ప్రకారం.. మండలంలోని కొర్విపాడుకు చెందిన ఖాజా హుస్సేన్(49) బుధవారం అదృశ్యమయ్యాడు. ఈ నెల 4న నమాజ్‌కు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోడంతో కుటుంబ సభ్యులు బంధువులతో, తెలిసిన వారితో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో అతని భార్య శంషీన్‌బేగం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ట్రాలీ ఆటోను ఢీకొట్టిన బస్సు



ఉండవెల్లి: మండలంలోని కంచుపాడు శివారులోని జాతీయ రహదారిపై కర్నూల్ వైపు వెళ్తున్న టాటా ఏసీ వాహనాన్ని వెనుక నుంచి అతివేగంతో ప్రైవేట్ బస్సు ఢీకొట్టింది. వాహనంలో ఉన్న ఇరువురిలో ఒకరికి తీవ్రగాయాలు కావడంతో 108లో కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. మరో వ్యక్తి స్వల్ప గాయాలయ్యాయి. హైదరాబాద్‌కు చెందిన నరేష్, గోపీ టాటాఏసీ ట్రాలీ ఆటోలో ఈవెంట్ సంబంధించిన పరికరాలతో బెంగుళూర్‌కు తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలో బుధవారం తెల్లవారుజామున వాహనం టైర్ పంక్చర్ కావడంతో టైర్ మార్చుతుండగా ప్రవేట్ వాహనం ఢీకొట్టింది. దీంతో నరేష్‌కు తీవ్ర గాయాలు కాగా 108లో కర్నూల్‌కు తరలించారు. గోపికి స్వల్పగాయాలయ్యాయి. వాహనంలో ఈవెంట్ పరికరాలు రోడ్డుపై చెల్లాచెదురయ్యాయి. రోడ్డుపై ట్రాఫిక్ జామ్ కావడంతో హైవే సిబ్బంది అదుపు చేశారు. బస్సులో 22 మంది ప్రయాణికులు సురక్షితంగా ఉన్నారు.

మెడిసిన్ విద్యార్థికి సన్మానం



అయిజ: మండలంలోని సంకాపురంలో కుర్వ లింగన్న కుమారుడు వేణుగోపాల్ మెడిసిన్‌లో సీటు సాధించాడు. మంగళవారం వెలువడిన నీట్ పరీక్ష ఫలితాల్లో 720 మార్కులకు, 621 మార్కులు సాధించి ఆల్ ఇండియా ర్యాంక్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. బుధవారం బీఆర్‌ఎస్ నాయకుడు సంకాపురం రాముడు తన నివాసంలో విద్యార్థిని శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుజాత, గ్రామస్తులు పాల్గొన్నారు.

మహిళలకు ఆర్థిక చేయూత



ఉండవెల్లి పాఠశాలలో యునిఫాంలను పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ

- విద్యార్థుల యూనిఫాం కుట్టే బాధ్యత మహిళా సంఘాలకు..
- ఒక్క జతకు రూ.70 చెల్లింపు
- సెర్ప్ ఆధ్వర్యంలో దుస్తుల తయారీ
- 23 పాఠశాలల్లో 2517 మంది విద్యార్థులకు..



ఉండవెల్లిలో యునిఫాంను కుట్టుతున్న మహిళా సంఘాల సభ్యులు

ఉండవెల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అందించే యూనిఫాంలను కుట్టేందుకు ఈ సారి ప్రభుత్వం మహిళా సంఘాలకు అప్పగించింది. గతంలో ఇదే పనిని గుత్తేదారు వచ్చిన తరువాత మహిళల ఆర్థికాభివృద్ధిని ఆలోచించి దుస్తులు కుట్టే పనిని మహిళా సంఘాలకు అప్పగించింది. వాటిని మండలంలోని పేదరిక నిర్మూలన సంస్థ పర్యవేక్షిస్తోంది.

మండలంలో 23 పాఠశాలలు..

మండల కేంద్రంలోని 27 ప్రభుత్వ పాఠశాలల్లో బాలబాలికలకు కలిపి మొత్తం 4568 మంది ఉన్నారు. వాటిలో 23 సర్కారు పాఠశాలలు మాత్రమే అందులో 2517 మంది విద్యార్థులకు మాత్రమే యూనిఫాం వచ్చాయి. 80 మంది మూడు గ్రామాల్లో కుట్టేందుకు మహిళాకు బాధ్యతలు అప్పగించారు. ఇందుకు సంబంధించిన వస్త్రం ప్రభుత్వమే అందజేస్తుంది. మండల కేంద్రం , తక్కశిల, కలుగోట్ల గ్రామాల్లో ఏర్పాటు చేసిన కుట్టు కేంద్రంలో 80 మంది కుట్టుతున్నారు. ఇప్పటి వరకు సుమారు 1600 మందికి పైగా దుస్తులను కుట్టారు. ఒక్క యునిఫాం కుడితే ప్రభుత్వం రూ.70 మాత్రమే చెల్లిస్తుంది. ఈ ధర గిట్టుబాటు కావడం లేదని మహిళలకు పేర్కొంటున్నారు.

డీఆర్‌డీఓ ఆధ్వర్యంలో..

మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు వచ్చిన యునిఫాంలను ఉండవెల్లి, తక్కశిల, కలుగోట్ల గ్రామాల్లో విద్యార్థులకు కుట్టిస్తున్నారు. ఈ బాధ్యతలను డీఆర్‌డీఓ ఆధ్వర్యంలో సెర్ప్ ఉద్యోగులు మహిళా సంఘాల నాయకులకు అప్పగించారు.

గిట్టుబాటు కావడం లేదు..



విద్యార్థులకు దుస్తులు కుట్టే పనిని అప్పగించడం వల్ల ఎంతో కొంత ఆర్థికంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంది. ప్రతిసారి ఇదే విధంగా మహిళలకు పనులను అప్పగిస్తే బాగుంటుంది. కుట్టు శిక్షణ పూర్తి చేసి ఎలాంటి పనులను అప్పగిస్తే బాగుంటుంది. కుట్టు శిక్షణ పూర్తి చేసి ఎలాంటి పనులు లేకుండా ఖాళీగా ఉంటున్నవారికి ఇదో మంచి అవకాశం అయితే కేవలం రూ.70 మాత్రమే ఇవ్వండంతో ఎలాంటి గిట్టుబాటు లేకుండా పోయింది.

– నసీమా, ఉండవెల్లి

గడువులోగా అందిస్తాం..



అధికారులు తెలిపిన గడువులోగా విద్యార్థులకు యూనిఫాంలు అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే సెర్ప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టు కేంద్రాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు. కుట్టు పని వేగవంతంగా సాగుతోంది. మహిళా సంఘాలకు ఇదో మంచి అవకాశం.

– కోటేశ్వరి, ఏపీఎం, ఉండవెల్లి

ఇంటర్ విద్యార్థులకు హాస్టల్ వసతి

- విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన
- ప్రిన్సిపాల్ హృదయ్‌రాజ్



బుక్కాపూర్ లో అడ్మిషన్ డ్రైవ్‌లో అధ్యాపకులు



గ్రామంలో పర్యటిస్తున్న అధ్యాపకులు

అలంపూర్ రూరల్: అలంపూర్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరే విద్యార్థిని, విద్యార్థులకు ప్రభుత్వ హాస్టల్ సౌకర్యం ఏర్పాటు చేస్తోందని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి, కళాశాల ప్రిన్సిపాల్ హృదయ్‌రాజ్ తెలిపారు. బాలికలకు, బాలురకు వేరువేరు గా హాస్టల్ సౌకర్యం ఉందని, ఈ అవకాశం తల్లిదండ్రులు గమనించి తమ పిల్లలను దూర ప్రాంతాలకు పంపి అధిక ఫీజులు చెల్లించి ఆర్థిక భారం తెచ్చుకోవద్దని ఆయన సూచించారు. ఎన్నో ఏళ్ల అనుభవం ఉన్న సీనియర్ అధ్యా పకులు ప్రభుత్వ కళాశాలలో మెరుగైన విద్యాబోధన చేస్తున్నారన్నారు. కళాశాల అడ్మిషన్ డ్రైవ్‌లో భాగంగా బుధవారం అధ్యాపకులు బుక్కాపూర్, కోనేరు, తదితర గ్రామాల్లో తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ కళాశాలలో తమ పిల్లలను చేర్పించాలని, మెరుగైన విద్య అందిస్తున్నట్లు తెలిపారు. 8 అడ్మిషన్లు అయినట్లు అధ్యాపకులు ఎస్ రాముడు, రామచంద్రయ్య , రఘువీర్‌కుమార్‌లు తెలిపారు.

అడ్మిషన్లు నమోదు చేసుకోవాలి

మానవపాడు: మండలంలోని శ్రీ గంగా వెంకటకృష్ణారెడ్డి ప్రభుత్వ మెమోరియల్ జూనియర్ కళాశాలలో ఇంటర్‌లో ప్రవేశం కోసం అడ్మిషన్లు ప్రారంభమైనట్లు అధ్యాపకులు వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల్లో కళాశాల సిబ్బందితో కలిసి పర్యటించి విద్యార్థులకు కళాశాల ప్రవేశాలపై అవగాహన కల్పించారు. ఎంపీసీ, బైపీసీ గ్రూపులలో ప్రవేశం పొందే విద్యార్థులు కళాశాలలో సంప్రదించి వెంటనే తమ అడ్మిషన్‌ను నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ఉన్నారు.

అయ్యప్ప స్వామికి అభిషేకం



ఉండవెల్లి: మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో అయ్యప్ప స్వామికి బుధవారం పంచామృతాభిషేకం నిర్వహించారు. ఆలయంలో అర్చకులు ఆంజనేయశర్మ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త దామోదర్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

పది సప్లిమెంటరీకి ఒక్కరే హాజరు

అలంపూర్ రూరల్: అలంపూర్ పట్టణంలోని జడ్పీహెచ్‌ఎస్ (హరిజనవాడ) పాఠశాలను 10 సప్లిమెంటరీ పరీక్ష కేంద్రంగా ఏర్పాటు చేశారు. బుధవారం హిందీ పరీక్ష కొనసాగగా 8 మంది విద్యార్థులకు గాను ఒక్క విద్యార్థి పరీక్షకు హాజరై, 7మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ మధు, డిపార్ట్‌మెంటల్ అఫీసర్ వెంకట్‌నాయుడు తెలిపారు.

50ఏళ్ల తర్వాత వరుసగా మూడోసారి..

శాంతినగర్: కేంద్రంలో ముచ్చటగా మూడోసారి ఎన్డీఏ అధికారంలోకి వచ్చిందని వడ్డేపల్లి మున్సిపాలిటీ బీజేపీ ప్రధాన కార్యదర్శి పైపాడు వెంకటేశ్వర్లు అన్నారు. వడ్డేపల్లి పురపాలికలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. 1970 తరువాత కేంద్రంలో ఒకే పార్టీ పదేళ్లపాటు పరిపాలించింది లేదన్నారు. బీజేపీ మాత్రమే 50 ఏళ్ల తరువాత చరిత్ర తిరగరాస్తూ మూడోసారి అధికారం చేపట్టబోతుందన్నారు.

బీజేపీ పుంజుకుంది

అయిజ: జోగుళాంబ గద్వాల జిల్లాలో బీజేపీ అనూహ్యంగా పుంజుకుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాగర్ కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల్లో భాగంగా గద్వాల జిల్లాలో భారతీయ జనతా పార్టీకి 14,894 ఓట్ల మెజార్టీని జిల్లా ప్రజలు కట్టబెట్టారన్నారు. భవిష్యత్‌లో బీజేపీ మరింతగా పుంజుకుంటుందనే అభిప్రాయం వ్యక్తం చేశారు.

పరిశుభ్రతపై అవగాహన



పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న కళా బృందం సభ్యులు

మానవపాడు: మండల వైద్యాధికారి డాక్టర్ రిజ్వానా తస్నీర్ ఆధ్వర్యంలో బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో కళాజాత బృందం సభ్యులు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాజాత బృందం సభ్యులు మండలంలోని ఆయా గ్రామాలను సందర్శించి పాటల రూపంలో ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. వచ్చే వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉంటూ వైద్య సిబ్బంది అందించే సూచనలు తప్పకుండా పాటించాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది చంద్రన్న, తిరుమలరావు, తదితరులు ఉన్నారు.

పర్యావరణాన్ని రక్షించుకోవాలి



ఎంఏఎల్‌డీ డిగ్రీ కళాశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న అధ్యాపకులు



ప్రిన్స్‌స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో..



డి.బూడిదపాడులో మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ



యల్లందొడ్డిలో..



పెద్దఆముదాలపాడులో..

గద్వాల అర్బన్: ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన అవసరం ఉందని ఎంఏఎల్‌డీ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ హరిబాబు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు నాగభూషణం, శ్రీనివాస్, వినోద, ఎల్లస్వామి, సురేష్, సుబ్రమణ్యం ఉన్నారు.

ప్రిన్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో..

ప్రిన్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని సత్యసాయి డిగ్రీ కళాశాల ఆవరణలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అటవీశాఖ అధికారి వజీద్ హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ పర్యావరణంపై అవగాహన కలిగి ఉండాలని, కాలుష్యాన్ని నివారించాలన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలో విద్యార్థులతో ర్యాలీ చేపట్టారు. అంతకు ముందు మొక్కలను నాటారు. కార్యక్రమంలో న్యాయవాది వరలక్ష్మీ దేవి, కళాశాల కరస్పాండెంట్ మాకం బీమపల్లి, ప్రిన్స్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు గిరిబాబు, సభ్యులు ఆనంద్, వినయ్, సురేష్ ఉన్నారు.

లైఫ్ చేంజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

లైఫ్ చేంజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని సంతోష్ నగర్‌లో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ఫౌండర్ పరశురాముడు మాట్లాడుతూ ప్లాస్టిక్‌ను నివారించుదామన్నారు. మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమన్నారు. కార్యక్రమంలో సభ్యులు ప్రవీణ్, వెంకి తదితరులు ఉన్నారు.

ఘనంగా పర్యావరణ దినోత్సవం

మానవపాడు: మండలంలోని పెద్దఆముదాలపాడు గ్రామంలో బుధవారం ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పెద్దఆముదాలపాడు గ్రామంలో అవెన్యూ ప్లాంటేషన్ మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏపీఓ విజయశంకర్ కార్యదర్శి ప్రవీన్‌కుమార్, ఈసీ చెన్నకేశవులు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు మానవాళికి ఆధారం

ఉండవెల్లి: మొక్కలు మానవ మనుగడకు ఆధారమని ఎంపీఓ పద్మావతి, ఏపీఓ సుజాత తెలిపారు. బుధవారం మండలంలోని డీ.బూడిదపాడు శివారులో రోడ్డుకు ఇరువైపుల ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. మొత్తం 260 మొక్కలను ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో నాటించారు. ఎంపీఓ మాట్లాడుతూ మొక్కలు నాటిన తరువాత వాటిని రక్షించాలన్నారు. కార్యక్రమంలో టీఏలు విజయ్‌కుమార్, రామచంద్రుడు, పంచాయతీ కార్యదర్శి రాజేశ్వర్‌రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్లు, కూలీలు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

గట్టు: నాటిన ప్రతి మొక్కను సంరక్షించుకోవాలని, మొక్కల సంరక్షణ సమిష్టి బాధ్యతగా తీసుకోవాలని నీతి అయోగ్ కో ఆర్డినేటర్ అబ్దుల్ ఫజల్, ఎంపీడీఓ చెన్నయ్య, ఏపీఓ స్వామిలు కోరారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం యల్లందొడ్డి శివారులో కూలీలతో మొక్కలను నాటారు. తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తిదారుల యూనియన్ జిల్లా కోఆర్డినేటర్ నర్సింహులు ఆధ్వర్యంలో మాచర్లలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అవగాహన నిర్వహించారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న అధికారులు

అయిజ: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన ఏకరూప దుస్తులు (స్కూల్ యూనిఫాం) పంపిణీ కార్యక్రమాన్ని ఇన్‌చార్జి ఎంఈఓ నరసింహ బుధవారం ఎమ్మార్సీ కార్యాలయంలో ప్రారంభించారు. తహసీల్దార్ జ్యోతి, ఎంపీడీఓ వెంకటయ్య, మహిళా సమాఖ్య ఏపీఎం అనుపమలు దుస్తులు, పుస్తకాలను ఆయా పాఠశాలల హెడ్ మాస్టర్లకు అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు, కేజీబీవీలో 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదివే విద్యార్థులకు ప్రతి ఒక్కరికీ రెండు జతల ఏకరూప దుస్తులు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల హెడ్ మాస్టర్లు పాల్గొన్నారు.

వైద్యులు సమయపాలన పాటించాలి

గట్టు: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులతో పాటుగా వైద్య సిబ్బంది సమయపాలన పాటించడం లేదని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు మాచర్ల ప్రకాష్ ఆరోపించారు. బుధవారం గట్టు ప్రభుత్వ ఆస్పత్రిని మాచర్ల ప్రకాష్, మోజేష్‌లు సందర్శించారు. ప్రభుత్వ ఆస్పత్రికి పేదలు అధిక సంఖ్యలో వస్తుంటారని, ఇక్కడ వైద్యులతో పాటుగా సిబ్బంది అందుబాటులో లేక పోవడంతో ఇబ్బంది పడుతున్నట్లు పేర్కొన్నారు. జిల్లా అధికారులు స్పందించి మండలంలోని ఆస్పత్రిపై దృష్టిని సారించాలని విజ్ఞప్తి చేశారు.

రేషన్ బియ్యం పట్టివేత

గద్వాల క్రైం: అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న గూడ్స్ వాహనాన్ని స్వాధీనం చేసుకుని వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. ధరూర్ మండలానికి చెందిన ఎరుకలి వెంకటేష్ బుధవారం తెల్లవారు జామున గద్వాల నుంచి రాయచూర్‌కు 30 క్వింటాళ్ల రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు సమాచారం వచ్చింది. దీంతో పట్టణంలోని గంజిపేట కాలనీ సమీపంలో గూడ్స్ వాహనాన్ని తనిఖీ చేసి రేషన్ బియ్యం గుర్తించి వాహనం పట్టుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పడకేసిన 'ప్రత్యేక పాలన'

- కొరవడిన పారిశుద్ధ్యం
- సమస్యలతో ప్రజలు సతమతం



మానవపాడులో మురుగుతో అవస్థలు

మానవపాడు: పల్లెల్లో ప్రత్యేకాధికారుల పాలన పడకేసింది. ఒక్కో అధికారికి ఒకటి, రెండు గ్రామ పంచాయతీల బాధ్యతలు అప్పగించారు. వారు చుట్టపు చూపుగా పల్లెల్లో పర్యటిస్తుండటంతో సమస్యల చిట్టా క్రమేణా పెరుగుతోంది. గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

భారంగా విధుల నిర్వాహణ

మండలంలోని 16 గ్రామ పంచాయతీలున్నాయి. ఈ ఏడాది జనవరి నెలాఖరున గ్రామాల్లో పాలక వర్గాల గడువు ముగియడంతో ప్రభుత్వం ప్రత్యేకాధికారుల పాలనకు శ్రీకారం చుట్టింది. ఒక్కో అధికారి గ్రామాల్లో ప్రత్యేక అధికారులు పర్యవేక్షించడం రోజువారిగా సాధ్యకావడం లేదు. కనీసం వారికోసారైనా ఆయా గ్రామాల్లో ప్రత్యేక అధికారులు పర్యటించలేకపోతున్నారు. దీనికి తోడు ప్రత్యేక అధికారులకు సొంత విధులు ఉంటాయి. ఉన్నతాధికారులతో సమీక్షలు, సమావేశాలకు హాజరుకావాలి. కొంతమంది అధికారులు సాకులు చెప్పి విధులకు డుమ్మా కొడుతున్నారు. ఇంకొందరు ప్రత్యేక విధుల పేరిట సమయం కేటాయించడం లేదనే ఆరోపణలున్నాయి. దీంతో ఎక్కడి సమస్యలు అక్కడే దర్శనమిస్తున్నాయి.

గ్రామాల్లో సమస్యలు..

మండలంలోని ఆయా గ్రామాల్లో సమస్యలు తలెత్తుతున్నాయని గ్రామస్తుల ఆరోపణలున్నాయి. మిషన్ భగీరథ కొన్ని గ్రామాల్లో పైప్‌లైన్ చాలా చోట్ల లీకై నీటి సరఫరా కావడం లేదు. పాడైన బోర్లను కొన్ని చోట్ల రిపేరు చేయించారు. కొన్ని చోట్ల అసంపూర్తిగా ఉన్నాయి. గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలు, నర్సరీలు పల్లెప్రకృతి వనాలు, వైకుంఠధామాలు అటకెక్కాయి. కేంద్ర ప్రభుత్వం నిధులు రెండు నెలలకోసారి రావడంతో సరిపోక గ్రామ పంచాయతీలకు ఇక్కట్లు తప్పడం లేదు. గ్రామ పంచాయతీల్లో నిధుల కొరత వల్ల అధికారులు సమస్యలు పట్టించుకోవడం లేదు. ప్రత్యేక అధికారులు గ్రామాల్లో పర్యటించి పరిశుభ్రంగా ఉంచాలని ప్రభుత్వం ఆదేశిస్తోంది. గ్రామాల్లో సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి



గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి. గ్రామాల్లో సర్పంచ్‌లు లేక పోవడంతో ప్రత్యేక అధికారులు చొరవ చూపి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలి

– నాగేష్, మానవపాడు

ప్రత్యేకాధికారులు పర్యటించాలి



మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రత్యేక అధికారులు పర్యటించాలి. సమస్యలు తెలుసుకోని వాటి పరిష్కారానికి కృషి చేయాలి

– లక్ష్మన్న, చెన్నిపాడు

చర్యలు తీసుకుంటాం..

గ్రామాల్లో ప్రత్యేక అధికారులు పర్యటించేలా చర్యలు తీసుకుంటాం. కార్యదర్శుల ద్వారా సమస్యలు తెలుసుకోని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. ప్రత్యేక సమావేశం నిర్వహించి పర్యవేక్షిస్తాం.

– ఆంజనేయరెడ్డి, ఎంపీడీఓ మానవపాడు



చెన్నిపాడు గ్రామ పంచాయతీ వద్ద వృథాగా ఉన్న ట్రై సైకిల్